

హైదరాబాద్ వార్త

## నగర శివారుల్లో యువకుని దారుణహత్య

### కత్తులతో పొడిచి చంపిన నిందితులు

సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త: హైదరాబాద్ నగర శివార్లలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని ప్రత్యర్థులు విచక్షణారహితంగా కత్తులతో పొడవడంతో సదరు యువకుడు సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. చార్మినార్‌లోని ఓ వస్త్ర దుకాణంలో పని చేసే వాది-ఎ-ముస్తఫా కాలనీకి చెందిన మహ్మద్ నిస్సార్ (25)పై మంగళవారం అర్ధరాత్రి సమయంలో వాది-ఎ-సలాన్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడి చేశారు. ఈ నేపథ్యంలో పది పన్నెండు కత్తి పోట్లకు గురైన నిస్సార్ రక్తపు మడుగులో అక్కడికక్కడే కుప్పకూలాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న బాలాపూర్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని శవానికి పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. పాతకక్షల కారణంగానా లేదా మద్యం మత్తులో గొడవ కారణంగా హత్య జరిగిందా? అనే కోణాల నుండి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇన్స్ పెక్టర్ బొడ్డుపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతున్నది.



హత్యకు గురైన నిస్సార్, (ఇన్‌సెట్‌లో) నిస్సార్ (ఫైల్)

## కొనసాగుతున్న నిరసనలు

- పాతబస్తీలోని పలు ప్రాంతాలలో ఎమ్మెల్యే రాజాసింగ్ దిష్టిబొమ్మలు దగ్ధం
- పటిష్ట భద్రతా ఏర్పాట్లు
- 56 మంది కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు
- పోలీస్ వాహనంపై రాళ్లతో దాడి
- ఆందోళనకారులను చెదరగొట్టిన పోలీసులు
- పలు ప్రాంతాలలో షాపులు మూసివేత
- ఎమ్మెల్యేపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఎంఐఎం నాయకుల డిమాండ్





పాతబస్తీలో ఆందోళన కారులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చార్మినార్, ఆగష్టు 24 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీలో ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పలు చోట్ల బుధవారం నిరసన వ్యక్తం చేశారు.పలు ప్రాంతాలలో సగం షాపులు మూసి వేసి ఉన్నాయి.పలు చోట్ల నిరసన వ్యక్తం చేస్తున్న ఆంధోళనకా రులను పోలీసులు చెదరగొట్టారు.ఎమ్మెల్యే రాజాసింగ్ ఓ వర్గంపై చేసిన వివాద స్పద వ్యాఖ్యలకు నిరసనగా పాతబస్తీలోని పలు ప్రాంతాలలో రాజాసింగ్ దిష్టిబొమ్మలను దగ్గం చేసి నిరసన తెలియజేశారు. దీంతో పాతబస్తీలో బుధవారం మళ్లీ ఉద్రిక్తత చోటు చేసుకుంది. బస్సులు యధావిధిగా నడిచాయి. చార్మినార్ సమీపంలోని శాలిబండ వద్ద ఫత్తర్‌గట్టి డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ సోహెల్ ఖాద్రి ఆధ్వర్యంలో ఎంఐఎం నాయకులు ఎమ్మెల్యే రాజాసింగ్‌ను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.దీంతో శాలిబండ ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది.పోలీసులు అంధోళన కారులను చెదరగొట్టి కార్పొరేటర్ మహ్మద్ సోహెల్ ఖాద్రితో పాటు మరో 30 మందిని అదుపులోకీ తీసుకున్నారు.వీరిని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శాలిబండ పరిసర ప్రాంతాలలో గట్టి బందో బస్తును ఏర్పాటు చేశారు. కాగా సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో శాలిబండ చౌరస్తాలో ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యలకు నిరసనగా ధర్నా నిర్వహించిన 25 మందిని హుస్సేనీ ఆలం పోలీసులు అదుపులోకి తీసుకుని కంచన్‌బాగ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఓ వర్గానికి చెందిన వ్యాపారులు మదీనా,గుల్జారాహౌస్, శాలిబండ,ఫత్తర్‌గట్టి,శాలిబండ, లాడ్‌బజార్ మార్కెట్లలో స్వచ్ఛంధంగా షాపులు మూసివేసి బంద్ పాటించారు. కాగా మంగళవారం అర్ధరాత్రి పాతబస్తీ ఒల్గా హోటల్ వద్ద పోలీస్ వాహనంపై నిరసనకా రులు రాళ్లతో దాడి జరిపారు.ఈ దాడిలో పోలీస్ వాహనం అద్దం పగిలి పోయింది.సిటీ కళాశాల చౌరస్తా నుంచి గోషామహల్‌కు చేరుకునే రహదారిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వందలాది మంది నిరసన కారులు గోషామహల్ వైపు వెళ్లటానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని చెదరగొట్టారు. ఎమ్మెల్యే రాజాసింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎంఐఎం పార్టీ రాష్ట్ర శాసన సభ స్పీకర్‌కు లేఖ రాసింది.

గోషామహల్ శాసన సభ్యులు రాజాసింగ్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని ఎంఐఎం అధ్యక్షులు, ఎంపి అసదు ద్దీన్ ఓవైసీ డిమాండ్ చేశారు. హైదరాబాద్ పాత బస్తీలో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆంధోళన చెందుతున్నారు. కాగా పాతబస్తీలోని అన్ని ప్రాంతాలలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

## ఎక్కడంటే అక్కడే బ్రేక్‌డౌన్లు



### కాలంచెల్లిన బస్సులతో డ్రైవర్ల అవస్థలు
### ఆర్‌టిసి ఇక కొత్త బస్సులు సమకూర్చుకునేనా?
### ప్రస్తుతానికి బస్ నంబర్లు తెలిపే బోర్డులపైనే నజర్

హైదరాబాద్ ఆగస్టు 24 ప్రభాతవార్త : పాత బస్సులను తొలగించి కొత్త బస్సులను సమకూర్చుకునేందుకు టిఎస్ ఆర్‌టిసి అడుగులు వేస్తోంది. పాతవి కాలం చెల్లిన బస్సులే నగర ఆర్‌టిసిలో సింహ భాగం ఉంటున్నాయి. ఇవి ఎప్పుడు ఎక్కడ బ్రేక్ డౌన్ అవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అసలే పాత బస్సులు పైగ కాలం చెల్లినవి అన్న అభిప్రాయాలు ఉన్న ఈ బస్సులు ఎక్కడ పడితే అక్కడ నిలిచి పోతూ బ్రేక్ డౌన్ అవుతుండడంతో కొత్త బస్సుల కొనుగోలా? లేదా ప్రైవేటు బస్సుల లీజుకా అన్న దిశగా ఆర్‌టిసి యాజమాన్యం ఆలోచనల్లో పడింది. పాత బస్సులు ఎక్కడ పడితే అక్కడ బ్రేక్ డౌన్లు అవుతున్నాయంటూ డ్రైవర్లు ఫిర్యాదు చేస్తున్నారు కూడా . ఉదా.. మంగళవారం రాత్రి సికింద్రాబాద్ నుండి పటాన్ చెరువు వెళ్లున్న ఆర్‌టిసి బస్సు ఒకటి సరిగ్గా ప్యాట్నీ సెంటర్ బాలంరాయి చౌరస్తా దాటి కొన్ని మీటర్ల దూరంలో అదీ ప్రధాన రహదారిపై బ్రేక్ డౌన్‌తో అక్కడే నిలిచి పోయింది. ఎంతకూ కదలక పోవడంతో ఈ దారి గుండా వెళ్తున్న ఇతర వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డ్రైవరు చాక చక్యంగా రహదారి మధ్యలో ఆగి పోకుండా ఒక వైపు ఆపగలిగారు. కొన్ని నిమిషాలలోనే దీనిని రిపేరు చేసే మరో బస్సు వచ్చి రాత్రి 9.00 గంటల ప్రాంతంలో రిపేరు చేయగలిగారు. ఇలాంటి డొక్కు బస్సులు గ్రేటర్ పరిదిలో చాలానే ఉన్నాయి. మొత్తం 11 రీజియన్లు, 97 బస్ డిపోలతో విస్తృత నెట్‌వర్క్ కలిగి ఉన్న టిఎస్ ఆర్‌టిసి బస్సులను నడిపించడం కూడా అదే తరహాలో నడిపించేందుకు యత్నిస్తోంది.

**కొత్త ఎలక్ట్రిక్ బస్సులే శరణ్యమా..** ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా నగరంలో బస్సుల సంఖ్య లేదు. నిజానికి గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్‌టిసి బస్సుల సంఖ్య వివిధ కారణాల వల్ల తగ్గి పోతున్న వేళ ఈ సంఖ్యను పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందనే ఆలోచన లను పున: సమీక్షించుకుంటూ ఉంది. మరీ ముఖ్యంగా రోజు రోజుకూ డీజిల్ ఇంధన ధరలు అంతకంతకూ పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో ఆర్‌టిసిలో ఎలక్ట్రిక్ బస్సుల అవసరాన్ని గుర్తిస్తోంది. నేరుగా కొనేందుకు అందుకు తగ్గ ఆర్థిక వనరులు లేని పరిస్థితులలో అద్దెకు ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకోవాలని చూస్తోంది. మొదటి విడతలో టిఎస్ ఆర్‌టిసి గ్రేటర్ హైదరాబాద్‌జోన్‌లో సుమారుగా ఓ 300 ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకుని ఆ తర్వాత క్రమంగా విస్తరించుకునే దిశగా ఆలోచిస్తోంది. ఆర్‌టిసి వద్ద బాడీ గట్టిగా ఉన్న బస్సులను గుర్తించి వాటికి ఎలక్ట్రిక్ ఇంజన్లను అమర్చాలని నిర్ణయించింది. ఇటీవల ప్రయోగాత్మకంగా ఒకటి రెండు బస్సులకు అమర్చి నగర రహదారులపై నడిపించారుకూడా, వీటి పనితీరుపై ఆర్‌టిసి మెకానికల్ విభాగం అధికారులు అధ్యయనం కూడా చేస్తున్నారు. ఎలక్ట్రిక్ బస్సుకు కిలోమీటరుకు రూ. 7 అవుతుంటే డీజిల్ బస్సుకు అయితే రూ. 30 వరకు భరించాల్సి వస్తోంది. అందుకే ఎలక్ట్రిక్ బస్సులతో అయితేనే లాభాల బాటలో ప్రయాణించవచ్చని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. అటు కేంద ప్రభుత్వం కూడా కాలుష్య నివారణలో భాగంగా దేశ వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సుల వినియోగాన్ని పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలంగాణ ఆర్‌టిసి ఉన్నతాధికారులు చెబుతున్నారు. అన్ని గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో బస్ షెల్టర్లు సరిగా లేవన్న ప్రజా వినతుల మేరకు కొత్త వాటిని ఏర్పాటు చేయనుంది. అది కూడా ఆధునికత దిశగా ఆర్‌టిసి ముందుకు కదలనుంది. ఇందు కోసం గ్రేటర్‌లో కొత్త బస్ షెల్లర్ల ఏర్పాటు కు ఆర్‌టిసి చర్యలు తీసుకుంటోంది. వివిధ రూట్లలో ప్రయాణికులు రద్దీ నేపథ్యంలో రోజుకు వెయ్యి మందికి పైగా ప్రయాణికులు రాక పోకలు సాగించే ప్రాంతాల్లో కొత్త బస్ షెల్లర్ల ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేస్తోంది. ఇందు కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను కూడా భాగస్వామ్యం కావాలని కోరుతోంది. ఈ మేరకు జిహెచ్‌ఎంసి కి పలు వినతులను సమర్పించింది. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాం తాలతో పాటు రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను రోడ్ల వెడల్పులో భాగంగా తొలగించిన బస్ షెల్టర్లను ఒకటి రెండు నెలల్లోనే అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా టిఎస్ ఆర్‌టిసి చర్యలు తీసుకుంటోంది. తద్వారా ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణికులు సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుం దని అధికారులు భావిస్తున్నారు. ప్రయాణికులకు బస్సుల వివరా లు తెలిపేలా ప్రతి స్టాపులోనూ బస్సుల నెంబర్లను ఏర్పాటు చేయ నున్నారు. గ్రేటర్‌జోన్‌లోని అన్ని బస్‌డిపోల పరిధిలోని బస్ స్టేష న్లలోనూ విధిగా బస్ నెంబర్లు తెలిపే బోర్డులను ఏర్పాటు చేయనున్నారు.

## విద్యారంగంలో 18వ స్థానానికి దిగజారిన రాష్ట్రం: ఎంపి ఆర్ కృష్ణయ్య



సమావేశంలో ప్రసంగిస్తున్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

చిక్కడపల్లి, ఆగష్టు 24 ప్రభాత వార్త: తెలంగాణ ప్రభుత్వం 44వేల ప్రభుత్వ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం దారుణమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధినేత, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ప్రభుత్వ పాఠశాల్లో ఖాళీగా ఉన్న 44వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని, టెట్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ నిరుద్యోయ జేఏసీ ఆధ్వర్యంలో 'నిరుద్యోగుల సమావేశం' జేఏసీ చైర్మన్ నీల వెంకటేశ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి నియమించే 16వేల మంది విద్యావాలంటీర్లను కూడా ఈ సంవత్సరం రెన్యూవల్ చేయడం లేదని, ఇక విద్యార్థులకు పాటాలు ఎవరు చెబుతారని ప్రశ్నించారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం విద్యారంగంలో దేశంలో తెలంగాణ రాష్ట్రం 18వ స్థానానికి దిగజారిపోయిందని, సమాజంలో వందల సంవత్సరాలుగా కొనసాగుతున అసమానతలకు, శాస్త్రీయ పరిష్కారాన్ని చూపే విద్యావ్యవస్థ, ప్రభుత్వ విధానాల వల్ల అదే సంక్షోభంలోకి నెట్టివేయబడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోఠారి కమిషన్ సూచనలను అమలు చేసి విద్యారంగాన్ని బాగుచేయాలని, లేనిపక్షంలో అన్ని విద్యార్థి సంఘాలను, పార్టీలను ఐక్యం చేసి ప్రజా ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని హెచ్చరించారు. సర్కారు విద్యను ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనారిటీ కులాలు విద్యార్థులకు విద్యను దూరం చేసి పేదలకు విజ్ఞానవంతులు కాకూడదని ప్రభుత్వం కుట్ర చేస్తోందని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం, సతీష్, మల్లేష్ యాదవ్, భాస్కర్ ప్రజాపతి, దీపిక, లక్ష్మి, మంజుల, జ్యోతి, రజితపాల్గొన్నారు.

## గణేశ నవరాత్రులకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు

### ఖైరతాబాద్ గణేశుడి వద్ద ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త: ఈనెల 31నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే గణేష్ నవరాత్రి వేడుకలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తుందని రాష్ట్ర పశుసంవర్థక మంత్స్య పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ వెల్లడించారు. బుధవారం ఖైరతాబాద్ వినాయక మండపం వద్ద వివిధ శాఖల అధికారులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు పండుగలు, వేడుకలను ఘనంగా జరుపుకోవాలనేది సిఎం కెసిఆర్ ఆలోచన అన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వం అధ్వర్యంలో అన్ని పండుగలను నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. గణేష్ నవరాత్రుల సందర్భంగా భక్తులు, నిర్వాహకులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఖైరతాబాద్ వినాయకుడు అంటే తెలియనివారు ఉండరని ,ఎంతో ప్రసిద్ది చెందిన ఖైరతాబాద్ గణేషుడిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిమంది వస్తారని అన్నారు. దాన్ని దృష్టిలో ఉంచుకుని పటిష్టమైన భారికేడ్‌లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిభిరం ఏర్పాటు, నవరాత్రులు ముగిసే వరకు వాహనాల రాకపోకలను నిలిపివేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా జనరేటర్‌లను అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు. తాత్కాలిక టాయిలెట్స్‌ను కూడా అందుబాటులో ఉంచాలని జిహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో నిర్వహించే గణేష్ నవరాత్రులు, గణేష్ నిమజ్జనం వేడుకలకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఈసంవత్సరం జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఏ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల ఆధ్వర్యంలో 6లక్షల మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మినీఇండియాగా పిలువబడే హైదరాబాద్ నగరంలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలు చాలా బాధాకరమని ప్రజలు కూడా ఆవేశాలకు పోకుండా సంయమనం ఉండాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, బెవరేజెస్ చైర్మన్ గజ్జల నగేష్, గ్రంథాలయ చైర్మన్ ప్రసన్న, జోనల్ కమిషనర్ రవికిరణ్, డిసి మోహన్‌రెడ్డి, వైద్యాధికారి వెంకటి, ఉత్సవ కమిటీ అధ్యక్షులు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనంలో 'గుడ్లు మాయం'



ప్రభుత్వ పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

మలక్‌పేటజోన్ ప్రతినిధి, ఆగస్టు 24 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో గుడ్లు పెట్టడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పూర్తిగా పేదవారే ఉంటారన్నది అక్షర సత్యం. వారు తమ ఇండ్లలో సరియైన పోషకాహారం తీసుకునే అవకాశం ఉండదన్న ఉద్దేశ్యంతో మిడ్‌డే మీల్స్ కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాపవుట్స్‌ను తగ్గించడానికి కూడా కొంత వరకు మిడ్‌డే మీల్స్ తోడ్పడుతుంది. దీంతో అన్ని రాష్ట్రాలతో పాటు మన తెలంగాణాలో కూడా మిడ్‌డే మీల్స్‌ను అమలు చేస్తున్నారు. మన రాష్ట్రం లోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు వారంలో మూడు రోజుల పాటు విద్యార్థులకు గుడ్లు ఇస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారంలో మూడు రోజులు తప్పని సరిగా ప్రతి విద్యార్థికి గుడ్లు ఇవ్వాల్సి ఉంటుంది. అయితే చాలా చోట్ల కేవలం రెండు రోజులు మాత్రమే ఇచ్చి మూడు రోజులు ఇస్తున్న ట్లుగా రికార్డుల్లో రాసుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. గత నెల రోజులుగా వారంలో ఒక్కసారి కూడా గుడ్లు పెట్టడం లేదు. కొన్ని పాఠశాలల్లో మొత్తం లేదనకుండా వారంలో ఒకసారి కొంత మందికి ఇస్తున్నారు. మరికొన్ని పాఠశాలల్లో గత మూడు నెలలుగా గుడ్లు పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గుడ్లు రావడం లేదు కాబట్టే తాము విద్యార్థులకు పెట్టడం లేదని నగర పరిధిలోని కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ప్రధానోపాధ్యాయులు తెలిపారు. ఎందుకు గుడ్లు రావడం లేదన్న విషయంపై సమాధానం చెప్పడానికి వారు నిరాకరిస్తూ అదంతా తమకు తెలియదంటూ సమాధానం దాటవేశారు. హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు గుడ్లను సరఫరా చేసే ఫౌండేషన్ ప్రతినిధులను ఇదే విషయమై వివరణ కోరగా తమకు ఇప్పటికే పెద్ద మొత్తంలో విద్యాశాఖ అధికారుల నుంచి బకాయిలు రావాల్సి ఉండడంతో నగర పరిధిలో గత నెల 28వ తేదీ నుంచి గుడ్లను నిలిపివేసినట్లు తెలిపారు. తమ బకాయిలు చెల్లించాలని ఇప్పటికే డిఇఓకు కూడా లెటర్ ఇవ్వడం జరిగిందని, అయితే ఇప్పటి వరకు ఇంకా బకాయిలు విడుదల కాకపోవడంతోనే గుడ్ల సరఫరాను నిలిపివేసినట్లు వారు తెలిపారు.

## బండి సంజయ్‌కు సంఘీభావం తెలిపిన చార్మినార్ బిజెపి నాయకులు



చార్మినార్, ఆగష్టు 24 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి కేసిఆర్ అక్రమ అరెస్టులు,ఆరాచక దాడులు,నిరంకుశ నిర్బంధాలకు వ్యతిరేకంగా రాష్ట్ర బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ కరీం నగర్‌లో చేపట్టిన నిరసన దీక్షలో గోల్కొండ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి టి.ఉమా మహేంద్రతో పాటు చార్మినార్ నియోజకవర్గానికి చెందిన పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు. నిరసన దీక్ష చేపట్టిన బండి సంజయ్‌ను కలిసి ఉమామహేంద్రతో పాటు పలువురు నాయకులు తమ సంఘీ భావాన్ని తెలియజేశారు.

## నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీకి కరోనా పాజిటివ్

హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త: మాయదారి మహమ్మారి కరోనా ఎవరినీ వదిలిపెట్టడం లేదు. సామాన్యుల నుంచి సెలబ్రిటీలు, రాజకీయ నాయకుల వరకు అందరూ దాని బారినపడుతున్నారు. తాజాగా నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మీకి కరోనా సోకింది. ఆమె స్వల్ప అస్వస్థతతకు గురికావడంతో టెస్టు చేయించుకోగా మేయర్‌కు పాజిటివ్ అని నిర్ధారణ అయ్యింది. జిహెచ్‌ఎంసిలో సమస్యల పరిష్కారానికి వరుస సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈనేపథ్యంలో ఇటీవల తనను కలిసిన వారు తనతో పాటు పలు కార్యక్రమాల్లో పాల్గొన్న వారు కొవిడ్ టెస్టు చేయించుకోవాలని విజయలక్ష్మి కోరారు. కరోనా లక్షణాలు కనిపించడంతో టెస్ట్ చేయించుకున్నానని.. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగానే ఉందని.. ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే కోలుకుని అందరినీ కలుస్తానని చెప్పారు.



గన్‌ఫౌండ్రిలో తెలంగాణ విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న హైదరాబాద్ టీఎన్జీవో ఉద్యోగులు

## ప్రాంతాలకు అతీతం మహాభారతం

### ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి





కార్యక్రమంలో పాల్గొన్న మరుమాముల దత్తాత్రేయ శర్మ, ఆచార్య వేణు తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త: వ్యాసమహర్షి సంస్కృత మహాభారతాన్ని తెలుగులో 11వ శతాబ్దిలో నన్నయ ఆంధ్రీకరించగా, 13వ శతాబ్దిలో తిక్కన, ఎర్రనలు మిగిలిన భాగాలు పూర్తి చేశారని, ప్రాంతాలకు అతీతంగా వెయ్యి సంవత్సరాలుగా ఆదరణ పొందుతూ ఉందని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. సాహితీ జిగీష సాహిత్య, సాంస్కృతిక సంస్థ, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో 'మహాభారత సహస్రాబ్ది ఉత్సవం సభ బుధవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు బండారుపల్లి రామచంద్రరావు, రఘుశ్రీ, లలితవాణి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.వి.రమణాచారి మాట్లాడారు. మహాభారత కథ నేటికి ప్రజల్లో నిలిచి ఉండటానికి కారణం పాత్రల ఔచిత్యం, కథనం, నీతి సందేశం వంటి ఎన్నో అంశాలు నిండి ఉన్నాయన్నారు. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ మరో వెయ్యి సంవత్సరాలు గడచినా మహాభారతం నిత్యనూతనమన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా అదికవి నన్నయ్య గురించి గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.ఉమాశశి, కవిబ్రహ్మ తిక్కన గురించి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్, ప్రబంధ పరమేశ్వరుడు ఎర్రన గురించి ఓరియంటల్ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ బి.జయరాములు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పద్య కవిసమ్మేళనం మరుమాముల దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కవులు చిక్కారామదాసు, లలితాపరమేశ్వరి, సాధన నరసింహాచార్య, ఆచార్య వేణు, సంధ్య, కెవిఎన్.చారి, చిమ్మపూడి శ్రీరామమూర్తి తమ తమ అమూల్యమైన కవితలను వినిపించారు.

### విద్యా శాఖ మంత్రి ద్వంద్వ వైఖరితోనే

## బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థి మృతి



మంత్రి దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న టీజీవీపి నాయకులు

తార్నాక, ఆగస్టు 24 ప్రభాతవార్త: విద్యా శాఖ మంత్రి ద్వంద వైఖరి వల్లనే బాసర ట్రిపుల్ ఐటీ లో విద్యార్థి సురేష్ మృతి చెందాడని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టిజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి ప్రశాంత్ ఆరోపించారు. విద్యార్థి సురేష్ మృతికి నిరసనగా బుధవారం టీజీవీపీ ఆధ్వర్యంలో ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్ ఎదుట మంత్రి దిష్టిబొమ్మ దహనం చేసి మంత్రి సబితా ఇంద్రారెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విద్యార్థి మృతికి భాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేస్తున్నట్లు వారు చెప్పారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మృతుడి కుటుంబానికి రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని టీజీవీపి వర్కింగ్ ప్రసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థి మృతికి నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓ.యూ అధ్యక్షులు తాడెం రాజేష్, శ్రీశైలం గౌడ్, నరేందర్, వెంకటేష్ నాయక్, మురళి, కార్తిక్ తధితరులు పాల్గొన్నారు.

## 6 మెన్ కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయం


సమావేశంలో కంటోన్మెంట్ వికాస్ మంచ్ ప్రతినిధులు గద్దం ఏబేలు,సంకి రవిందర్ తదితరులు

కంటోన్మెంట్, ఆగస్టు 24 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డును జిహెచ్ఎంసీలో విలీనం చేయాలనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి 6 మెన్ కమిటీ ఏర్పాటు చేయడం శుభపరిణామమని కంటోన్మెంట్ వికాస్ మంచ్ అధ్యక్షులు,అడ్వకేట్ గద్దం ఏబేలు, ప్రధాన కార్యదర్శి సంకి రవిందర్ బాబులు తెలిపారు. బుధవారం కంటోన్మెంట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ ప్రజలు దశాబ్దాల కాలం నుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాన్నీ గ్రేటర్‌లో విలీనం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 6 మెన్ కమిటీని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ మంచ్ ప్రతినిధులు ప్రభుగుప్త,అరుణ్ యాదవ్, దామోదర్, అంబాల శ్రీనివాస్, నరి స్ంగ్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## వీఎన్ఆర్‌వీజేఐఈటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2022

నిజాంపేట్, ఆగస్టు24 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ విఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల స్మార్ట్ ఇండియా హ్యాకథాన్2022 గ్రాండ్ ఫినాలే ఎడిషన్‌ను గురువారం నిర్వహించనుంది. ఆగస్టు 25,26 తేదీలలో 36 గంటల పాటు కళాశాల ప్రాంగణంలో జరగనున్న ఈ హ్యాకథాన్‌కు అసోసియేట్ ప్రొఫెస్ డాక్టర్ కౌసర్ నిఖత్ సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్‌గా వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా డా.కౌసర్‌నిఖత్ మాట్లాడుతూ తమ విద్యార్థులు గత కొన్నేళ్లుగా స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌లో పాల్గొంటున్నారని, తనతో పాటు మరికొందరు అధ్యాపకులు వివిధ కళాశాలలో నిర్వహించిన హ్యాకథాన్ కార్యక్రమాలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారన్నారు. ఈ సంవత్సరం తమ కళాశాలలో హ్యాకథాన్ చివరి రౌండ్‌ను నిర్వహించడం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్నామన్నారు. దేశ వ్యాప్తంగా ఢిల్లీతో సహ 18 రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఈ హ్యాకథాన్‌కు హాజరవుతారని ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ కన్వీనర్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.చక్రవర్తుల కిరణ్ తెలిపారు.ప్రపంచంలోనే అత్యంత బృహత్తర స్థాయిలో నిర్వహించనున్న స్మార్ట్ ఇండియా హ్యాకథాన్‌కు తమ కళాశాల వేదిక కావడం ఎంతో సంతోషంగా ఉందని కళాశాల ప్రధాన అధ్యాపకులు డా. సి.డి నాయుడు తెలిపారు.

## నేటి నుంచి ప్రభుత్వ సిటీ కళాశాల శత వసంతాల వేడుకలు

చార్మినార్, ఆగస్టు 24 ప్రభాతవార్త : ప్రభుత్వ సిటీ కళాశాల శత వసంతాల వేడుకల సందర్భంగా ఈ నెల 25,26,27 తేదీలలో మూడు రోజుల పాటు విద్యా,కళా,సాంస్కృతిక మేళాను నిర్వహించనున్నామని ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.పి.బాల భాస్కర్ తెలిపారు.భాషా సాంస్కృతిక శాఖ,సిటీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో విద్యా,కళా,సాంస్కృతి మేళాను జరుపుతున్నామని ఆయన తెలియజేశారు. సిటీ కళాశాల అందించిన విద్యా, పోరాట స్ఫూర్తిని చాటి చెప్పాలని,తెలంగాణ భాష,సాహిత్యాల ఔన్నత్యాన్ని,కళా విశిష్టతను యువతకు తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేస్తున్న కార్యక్రమానికి రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం అందిస్తున్నదని ఆయన తెలిపారు.మేళా సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలను నిర్వహిస్తున్నామని ఆయన తెలియజేశారు.మూడు రోజుల పాటు జరగనున్న విద్యా,కళా,సాంస్కృతిక మేళాలో రాష్ట్ర ఎక్సైజ్,క్రీడలు,యువజన సర్వీసుల శాఖామాత్యులు వి.శ్రీనివాస్‌గౌడ్,తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ రసమయి బాలకిషన్,తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు మామిమామిడి హరికృష్ణ, పాటు పలువురు ప్రముఖులు,విద్యావేత్తలు పాల్గొంటున్నారని ఆయన తెలిపారు.25వ తేదీన విద్యార్థులు వేసిన జాతీయ నాయకులు,కవులు,చారిత్రక ప్రదేశాలలకు సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్,26వ తేదీన పూర్వ విద్యార్థుల మహా సమ్మేళనం,27వ తేదీన బహుమతుల ప్రధానం,సాంస్కృతిక కార్యక్రమాలు,కామన్ వెల్త్ పోటీలో కాంస్య పతకం సాధించిన బేబీరెడ్డికి సన్మానం తదితర కార్యక్రమాలు జరుగుతాయని ప్రిన్సిపాల్ బాల భాస్కర్ వెల్లడించారు.

## బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి


జీటీఎస్ దేవాలయంలో శ్రీ భవానిశంకరా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 24, ప్రభాతవార్త : వెంగళ్‌రావునగర్ జీటీఎస్ కాలనీలోని శ్రీ వీరాంజనేయ భవానిశంకరా అయ్యప్ప స్వామి సాయి బాబా దేవస్థానం ప్రాంగణంలోని శ్రీ భవానిశంకర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కార్యానిర్వాహణ అధికారి జయ రామయ్య, చైర్మన్ సీహెచ్ చిన్న రమేష్‌లు తెలిపారు. ఈ నెల 25 గురువారం నుంచి 28వ తేదీ ఆదివారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను ఈ పూజా వేడుకలకు స్థానిక శాసన సభ్యులు మాగంటి గోపీనాథ్‌ను ఆలయ చైర్మన్ చిన్న రమేష్ కలిసి పూజా కార్యక్రమాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని ఆహ్వానించారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ దేదిప్య విజయకుమార్ ఆహ్వానించారు.25వ తేదీ గురువారం ఉదయం నుంచే విగ్నేస్వర పూజ, పున్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాస్వీకరణ, ద్వజారోహణం, మండప ఆహ్వానం, అగ్నిప్రతిష్ట, 26వ తేదీ శుక్రవారం ఉదయం నుంచే రాజశామల హోమం, మహాసుదర్శన హోమం, 28వ తేదీ ఆదివా రం పూర్ణాహుతి, నీరాజన మంత్ర పుష్పం, ఆశీర్వచనం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

## నీటి సమస్య తలెత్తకుండా విధులు నిర్వహించాలి : మేయర్


బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని వాటర్‌మెన్‌లకు సూచిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, ఆగస్టు 24 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలో నీటి సమస్య తలెత్తకుండా విధులు నిర్వహించాలని, వాటర్ మెన్‌లకు మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ సూచించారు. బుధవారం కార్పోరేషన్ పరిధిలోని వెస్టర్న్ కాలనీలో ఉన్న జల మండలి కార్యాలయంలో మేయర్ వాటర్‌మెన్‌లతో సమావేశమయ్యారు. కార్పోరేషన్ పరిధిలోని ఏఏ కాలనీకి ఎంత నీరు వస్తుంది? ఎక్కడెక్కడ నీటి సరఫరాలో లోపాలున్నాయి? తదితర అంశాలపై మేయర్ ఆరా తీశారు. వాటర్‌మెన్‌లు తెలిపిన పలు సమస్యలు రాసుకొన్నారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ జల మండలి నుంచి కావాల్సినంత నీరు మన కార్పోరేషన్‌కు వస్తుందని, ఏ కాలనీలో ప్రజలు ఇబ్బందులు పడకుండా నీటిని సకాలంలో సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడి నుంచైనా ప్రజలు నీటి ఇబ్బందులున్నాయని నా వరకు ఫిర్యాదులు వస్తే కఠినంగా చరనయలుంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అనేకమార్లు జల మండలి అధికారులను కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గంలో నీటి ఇబ్బందులు తీర్చాలని విన్నవించారని, దాని ఫలితమే గత మూడేళ్లుగా మన ప్రాంతాలలో నీటి సమస్య తగ్గిపోయిందన్నారు. గతంలో డిసెంబర్, జనవరి నెలల నుంచే వాటర్ ట్యాంకర్ల కోసం ప్రజలు ఎగబడే వారని, ఇప్పుడు నడి వేసవిలో సైతం ఒక్క ట్యాంకర్ రాకుండా ప్రజలకు నీటిని అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ సీనియర్ నేత పాండు తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమానుబంధాలను చాటిచెప్పిన సందేశాత్మక నాటకం 'ప్రస్థానం'


ప్రస్థానం నాటకంలో ఒక దృశ్యం

రవీంద్రభారతి, ఆగస్టు 24 ప్రభాతవార్త : ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో రసవాహిని అమలాపురం వారి సమర్పణలో మార్గశీర్ష రచన, షహన్‌షా దర్శకత్వంలో రూపొందిన 'ప్రస్థానం' నాటకం కన్న రక్తసంబంధం కన్నా కిరాయి మనుల ప్రేమ సంబంధమైనా మిన్న అని నొక్కిచెప్పి, ప్రేమానుబంధాలను చాటిచెబుతూ డబ్బుకన్నా ప్రేమ గొప్పదని, వృద్ధాశ్రయాల్లో అది దొరకదంటూ సందేశాత్మకంగా ప్రదర్శింపబడి విచ్చేసిన అశేష రంగస్థల ప్రేమికులు, ఔత్సాహిక నాటక ప్రియులను ఎంతగానో ఆకట్టుకొని రక్తికట్టిస్తూ ఆలోచింపజేసింది. టిక్కెట్టు కొనండి.. నాటకం చూడండి... మీ ప్రోత్సాహమే మాకు ఉత్సాహమంటూ నాటక ప్రదర్శనలను నిర్వహిస్తూ ఉభయ తెలుగురాష్ట్రాల రంగస్థల రంగాన్ని, నటీనటులను, సాంకేతిక వర్గాన్ని ప్రోత్సహిస్తున్న రసరంజని ఈనెల నాటక ప్రదర్శనలో భాగంగా షాహన్‌షా, ఎం.వి.రాజర్షి, డి.రాం బాబు, ఉమామహేశ్వరి, శ్రీజ నటీనటులు లేకలేక పుట్టిన కొడుకుమీద ఆ తల్లిదండ్రులు కొండంత ఆశలు పెట్టుకొని, ఆస్తిపాస్తులు అమ్ముకొని విదేశాల్లో పెద్దచదువులు చదివించి అమెరికాకు పంపి స్తారు. అక్కడ డాలర్ల సంపాదన, విలాసాలకు అలవాటు పడిపోయిన కన్నవారిమీద ప్రేమ, మమకారా లకు తిలోదకాలిచ్చి కొడుకును చూడాలన్న వారి ఆశకు కొడుకు కోడలిగా ఇద్దరు కిరాయి నటుల్ని పంపి వారిని మోసగిస్తాడు.

## పారిశుద్ధ్య నిర్వాహణలో చర్యలు తీసుకోవాలి : లింగాని ప్రసన్న


పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశమైన అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న, డిప్యూటీ కమిషనర్ దశరత్ తదితరులు

అడ్డగుట్ట,ఆగస్టు 24 ప్రభాతవార్త: పారిశుద్ధ్య నిర్వాహనకు జిహెచ్ఎంసి శానిటేషన్ విభాగం సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అడ్డగుట్ట డివిజన్ కార్పొరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్ సూచించారు. బుధవారం తుకారాంగేట్‌లో శానిటేషన్ విభాగం సిబ్బందితో డిప్యూటీ కమిషనర్ దశరత్‌లతో కలిసి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. కాలనీల్లో, బస్తీల్లో చెత్త కుండీలు లేకుండా ప్రతి ఇంటి నుండి పారిశుద్ధ్య వాహనాల ద్వారా తడి, పొడి చెత్తను వేర్వేర్‌గా సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవిందర్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ


విద్యార్థులతో ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు

జీడిమెట్ల, ఆగస్టు24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజవకవర్గం గాజులరామారం డివిజన్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు బ్యాగులు, నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ నోటు పుస్తకాల పంపిణీలో పల్స్ హార్ట్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు డా.ముఖర్జీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగరాజుయాదవ్, కార్పొరేటర్లు రావుల శేషగిరిరావు, జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, డివిజన్ల అధ్యక్షులు విజయ్‌రామ్‌రెడ్డి, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, ఏర్వ శంకరయ్య, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కెపి వివేకానంద్

నిజాంపేట్, ఆగస్టు 24 ప్రభాతవార్త: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్ నందనవనం కాలనీలో బుధవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద్ పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ సమస్యలపై ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించి వెంటనే వాటి పరిష్కారాని తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పౌరగ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేస్తాం: డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్


హరిశంకర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త: పౌరగ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని తెలంగాణ పౌరగ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ హరిశంకర్ పేర్కొన్నారు. జాతీయ గ్రంథపాలకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇండియన్ లైబ్రేరియన్ ప్రైడ్ అవార్డు-2022 ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌నగర్ నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి ఆయనను ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, ఆ శాఖ వికారాబాద్ శాఖ కార్యదర్శి సురేశ్‌బాబు, అనినాష్‌రావు, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్‌సొసైటీలో శ్రీనివాస్‌రెడ్డికి చోటు

చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రజాసంబంధాల రాష్ట్ర కన్వీనర్‌గా జాగృతి విద్యాసంస్థల చైర్మన్ ఓ.శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయనకు సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కె.మదన్మోహన్‌రావు నియామకపత్రాలను అందించార. రెడ్‌క్రాస్ సొసైటీ సేవలపై విస్తృత ప్రచారం చేస్తానని శ్రీనివాస్‌రెడ్డి వివరించారు. సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తానన్నారు.

## కెపిహెచ్‌బి కాలనీ డివిజన్‌ను అన్ని రంగాలలో అభివృద్ధిపరుస్తా : కార్పోరేటర్ మందాడి శ్రీనివాసరావు

వివేకానందనగర్‌కాలనీ, ఆగస్టు 24, ప్రభాతవార్త : భవిష్యత్తు అవసరాలు అనుగుణంగా కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ను అన్ని రంగాలలో అభివృద్ధి పరుస్తానని కెపిహెచ్‌బి కాలనీ డివిజన్ కార్పోరేటర్ మందడి శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ కార్పోరేటర్ మందడి శ్రీనివాసరావు బుధవారం 6వ ఫేస్ నేతాజీ పార్కు వద్ద బతుకమ్మ కుంట ఏర్పాటు చేయడానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి బాటలో పయనిస్తుందని అన్నారు. అదేవిధంగా కెపిహెచ్‌బి డివిజన్‌లో వందల కోట్ల రూపాయలు అభివృద్ధి జరిగిందని అన్నారు.అలాగే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ఎక్కడాలోటు లేకుండా బతుకమ్మ కుంటలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఈ ఆనంద్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు సంఘీభావం


ఎమ్మెల్సీ కవితను పరామర్శిస్తున్న ఆలకుంట హరి

తార్నాక, ఆగస్టు 24 ప్రభాతవార్త: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను టీఆర్ఎస్ గ్రేటర్ యువజన విభాగం అధ్యక్షులు ఆలకుంట హరి టీఆర్ఎస్ శ్రేణులు కలిసి ఆమెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆలకుంట హరి మాట్లాడుతూ ప్రశాంతంగా ఉన్న తెలంగాణాలో అలజడి సృష్టిస్తున్న బిజెపికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. కవిత ఇంటిపై జరిగిన దాడిని తాము తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. కవితకు అండగా ఉంటామని, బిజెపి నేతలకు తగిణగుణపాఠం చెబుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు సంతోష్, సునిల్ ముదిరాజ్, మల్లికార్జున్, టీవీ శ్రీనివాస్, అరుణ్ కుమార్, శివరాత్రి మల్లేష్, గోపాల్ రెడ్డి, వీసీ లాడ్జి బస్తీ నాయకులు ఆనంద్, మహేందర్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, ఆగస్టు 24, ప్రభాతవార్త: యూనివర్సిటీలో చదివే విద్యార్థులకు కేవలం శిక్షణ ఇవ్వడమే కాకుండా వారిని పరిశ్రమలకు పనికి వచ్చేలా తీర్చిదిద్దడంలో హిట్స్ ఎల్లవేళలా కృషి చేస్తుందని తమిళనాడు రాజధాని చెన్నైకి చెందిన హిందుస్థాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (హిట్స్) ప్రతినిధులు డా.అప్రోజ్, హిస్టర్ హెడ్ విద్య, డిప్యూటీరిజిస్ట్రార్ ప్రగత తెలిపారు. ఈమేరకు ప్రతిఏటా రెండురోజులపాటు హైదరాబాద్‌లో నిర్వహించే ఐసి3 కాన్ఫరెన్స్‌ను బుధవారం హైటెక్స్‌లో ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ హిట్స్‌లో ముఖ్యంగా ఎయిరోనాటిక్స్, ఎయిరో స్పెస్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఆసియాలోని అత్యంత ప్రతిభాశాలి విశ్వవిద్యాలయంగా పేరుగాంచిందన్నారు. వివిధ విభాగాల్లో 100కుపైగా కోర్సులను అందుబాటులోకి తేవడం జరిగిందని అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతోనూ ఒప్పందాలను కుదుర్చుకున్నామన్నారు. తమ యూనివర్సిటీలో చదివే విద్యార్థుల్లో 85శాతం 6నుంచి 13లక్షల వరకు నెలసరీ జీతాలతో వివిధ కంపెనీల్లో ఉద్యోగాలను సాధిస్తున్నారని పేర్కొన్నారు.

## టిఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోంది

హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని, ప్రజాస్వామ్యబద్ధంగా దీక్ష చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేయడం దుర్మార్గమని బిజెపి హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు విమర్శించారు. ప్రజాస్వామ్యబద్ధంగా బంజారాహిల్స్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి కార్యకర్తలపై దాడులు చేయడమే కాకుండా కేసులు నమోదు చేయడం అన్యాయమని దుయ్యబట్టారు. టిఆర్ఎస్ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ, ఈ ప్రభుత్వం చేసే తప్పులను కప్పిపుచ్చుకోవడం కోసం రకర కాలుగా డ్రామాలాడుతోందని, టిఆర్ఎస్ నేతలు కుంభకోణాలలో ఇరుక్కుపోయారన్నారు.

## తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధి : మంత్రి తలసాని



సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వ ఆసుపత్రులను ఎంతో అభివృద్ధి చేయడం జరిగిందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. బుధవారం అమీర్‌పేటలోని 50 పడకల ప్రభుత్వ ఆసుపత్రికి దాత సీల్‌వెల్ సంస్థ నిర్వాహకులు సుబ్బారావు సహకారంతో 5.50లక్షల రూపాయల విలువైన ఫ్రిజ్‌లు, ఏసీలు, టేబుల్స్, అల్మారాలు ఇతర ఫర్నిచర్స్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ దశరథకు మంత్రి అందజేశారు. పేద ప్రజలు అత్యధికంగా వైద్యం కోసం వచ్చే ప్రభుత్వ ఆసుపత్రికి స్వచ్ఛందంగా ముందుకొచ్చి సహాయం అందించిన దాత సీల్‌వెల్ సంస్థ నిర్వాహకులు సుబ్బాఆరవును మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే వారి సంఖ్య పెరగడమే మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని అనేందుకు నిదర్శనమని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా హరీష్‌రావు బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరులో అనేక మార్పులు తీసుకురావడం జరిగిందన్నారు. ఈ హాస్పిటల్‌కు రోజుకు 4వందల వరకు వివిధ రకాల ఇబ్బందులతో ఆసుపత్రికి వస్తుంటారని, వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి కావాల్సిన మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రైవేట్‌లో వేలాది రూపాయల విలువైన వైద్య పరీక్షలను ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచితంగా చేయబడుతుందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులతో పాటు వారి వెంట వచ్చే సహాయకులకు కూడా అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. 30 పడకల ఆసుపత్రిగా మంజూరై నిర్మాణం అసంపూర్తిగా ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరూత 50 పడకలకు పెంచి నిర్మాణం చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా హాస్పిటల్‌ను వంద పడకలకు పెంచేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ నామన శేషుకుమారి, డిసిహెచ్ఎస్ సునీత, ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్ సైదులు, డివిజన్ అధ్యక్షుడు హనుమంతరావు, అశోక్‌యాదవ్, సంతోష్, కూతురు నరసింహ, ముచ్చర్ల ఆంజనేయులు యాదవ్, ప్రవీణ్‌రెడ్డి, సహదేవ్ గౌడ్, కట్ట బలరాం, గోపిలాల్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ ఆటో టిప్పర్స్ డ్రైవర్స్‌తో ముఖాముఖి కార్యక్రమం

సంజీవరెడ్డి నగర్, ఆగస్టు 24, ప్రభాతవార్త : 148 రాంగోపాల్ పేట డివిజన్ కమీషనర్ జిహెచ్ఎంసి ఆదేశానుసారం బుధవారం కార్పోరేటర్‌తో ఇంటింటి చెత్త సేకరణ స్వచ్ఛ ఆటో టిప్పర్ డ్రైవర్స్ ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ చీర సుచిత్ర మాట్లాడుతూ వార్డులో పారిశుద్ధ్య సమస్యలు రాకుండా స్వచ్ఛ ఆటో టిప్పర్స్ విధిగా ప్రతి రోజు ఇంటింటి చెత్త సేకరణ చేపట్టాలన్నారు. ఆటో టిప్పర్ డ్రైవర్లు వెళ్లకుంటే ప్రజలు రోడ్లపైన వివిధ ప్రాంతాలలో చెత్త వేసి అపరిశుధ్యం అవుతుందని, దీని ద్వారా ప్రజలు అంటురోగాలకు గురి అవుతారని తెలిపారు. వార్డులో 37 స్వచ్ఛ ఆటో టిప్పర్స్ ఉన్నందున సంపూర్ణ పారిశుధ్యం నిర్వహించాలని కోరారు. ప్రజలకు మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టుటకు మీకు ఎటువంటి సహాయం కావాలన్న అందుకు ముందు ఉండి పై అధికారులతో సమీక్షించి మీ సమస్యలను పరిష్కరిస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు సంధ్య, ప్రవీణ్, శ్రీనివాస్, తేజశ్రీ, శానిటరీ జవాన్లు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ దాడులు, అరెస్టులు అపాలి

### బిజెపి కార్పోరేటర్ జి.మహాలక్ష్మీ రామన్‌గౌడ్ డిమాండ్


దీక్షలో పాల్గొన్న జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అక్రమ దాడులు, అరెస్టులు కొనసాగిస్తున్నదని ఆరోపిస్తూ ఆనేక మంది బిజెపి కార్యకర్తలు బుధవారం హిమాయత్‌నగర్ లోని బిజెపి కార్యాలయంలో దీక్ష చేపట్టడం జరిగింది. జిహెచ్ఎంసి కార్పోరేటర్ జి. మహాలక్ష్మిరామన్ గౌడ్ ఆధ్వర్యంలో ఆనేక మంది కార్యకర్తలు ఈ దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వ అక్రమ దాడులు, అరెస్టులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. బంజారాహిల్స్‌లో బిజెపి కార్యకర్తలపై అక్రమంగా దాడులు, శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టు చేయడం వంటి కార్యకలాపాలకు టిఆర్ఎస్ ప్రభుత్వం పాల్పడుతూ రాష్ట్రంలో శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తున్నదని ఆమె ధ్వజమెత్తారు. తక్షణమే బండి సంజయ్‌ను విడుదల చేయాలని, అక్రమ దాడులకు స్వస్తి పలకాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, శారద, మల్లేష్, సుధాకర్, అర్జున్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు బిజెపి కుట్ర

సైఫాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే బిజెపి కుట్ర పన్నుతున్నదని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. రాజకీయ నాయకులపై ఇడితో దాడులు దేశ వ్యాప్తంగా చేయించడం, మద్యం మాఫియా నేరాలను ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై అసత్య ఆరోపణలు చేయించడం, ఎంఎల్ఎ రాజాసింగ్ మతోన్మాద వ్యాఖ్యలు చేయడం వంటి కార్యక్రమాలతో రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనకు పురికోల్పాలని బిజెపి చూస్తున్నదని ఆయన ధ్వజమెత్తారు. బిజెపి ప్రలోభాలకు లొంగకుండా ప్రజలు శాంతియుతంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన నాయకులు


ఎమ్మెల్సీ కవితను చార్మినార్ టిఆర్ఎస్ నాయకులు రాధాక్రిష్ణ,విజయ్ కుమార్‌లు కలిసినప్పటి చిత్రం

చార్మినార్,ఆగష్టు 24 ప్రభాతవార్త : చార్మినార్ నియోజకవర్గం మొగల్‌పుర డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు పుప్పాల రాధాక్రిష్ణ పటేల్, సీనియర్ టిఆర్ఎస్ నాయకులు విజయ్ కుమార్ నాయకులు ఎమ్మెల్సీ కవితను కలిసి సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా మొగల్‌పుర డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షులు రాధా క్రిష్ణ మాట్లాడుతూ బిజెపిచేస్తున్న అసత్య,నిరాధా రమైన ఆరోపణలను ఖండిస్తున్నానని తెలిపారు.పలువురు టిఆర్ఎస్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బిజెపి భౌతిక దాడులకు పాల్పడటం సిగ్గుచేటు


అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న మాదిగ సంఘాల కార్యకర్తలు

సైఫాబాద్, ఆగస్టు 24 ప్రభాతవార్త: ఎంఎల్‌సి కల్వకుంట్ల కవితపై బిజెపి కార్యకర్తలు చేస్తున్న అసత్య ఆరోపణలకు వ్యతిరేకంగా, ఆమె నివాసంపై కార్యకర్తలు చేసిన దాడిని ఖండిస్తూ ఆనేక మాదిగ సంఘాలు బుధవారం ట్యాంక్‌బండ్ వద్దగల అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టాయి. ఈ సందర్భంగా వారు బిజెపికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాదిగ సంఘాల యునైటేడ్ ఫ్రంట్ అధ్యక్షుడు కొక్కిర భూమన్న, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా అధ్యక్షుడు మర్మాంగుల మల్లేష్‌మాదిగ, ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం నాయకుడు గద్ద యాదయ్యమాదిగ తదితరులు మాట్లాడుతూ కవిత ఒక మహిళా అని చూడకుండా నిరాధారమైన ఆరోపణలు చేసి బిజెపి భౌతిక దాడులకు పాల్పడం సిగ్గు చేటని నిశితంగా విమర్శించారు. తెలంగాణ జాగృతి సంస్థ ద్వారా కవిత తెలంగాణ ప్రజలలో చైతన్యం తీసుకు వచ్చి తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎంతో కృషి చేశారని, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తిచేసిన ఘనత ఆమెదేనని వారు స్పష్టం చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు టిఆర్ఎస్, సిఎం కెసిఆర్ ప్రశ్నిస్తున్నందుకే కవితపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని, కెసిఆర్ కుటుంబాన్ని మానసికంగా, రాజకీయంగా దెబ్బతీయాని బిజెపి కుట్ర పన్నుతున్నదని వారు ఆరోపించారు. బిజెపి కుట్రలకు వ్యతిరేకంగా మాదిగ సంఘాలు ఉద్యమిస్తాయని, కవితకు అండగా నిలుస్తామని వారు స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో జెర్రి పోతులు శ్రీనివాస్, ముత్యాలు, సలోమి, లక్ష్మి, సంపూర్ణ, సుశీల, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో శ్రావణానందలహరి



చిక్కడపల్లి, ఆగస్టు 24 ప్రభాతవార్త: చిక్కడపల్లి శ్రీ వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో శ్రావణానందలహరి పేరిట శ్రావణమాస పూజలను బుధవారం జవహర్‌నగర్‌లో సంఘం అధ్యక్షురాలు శ్రీరామ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర భ్ంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సౌందర్యలహరి పారాయణం, పుజను జగద్గురు శ్రీశంకరాచార్య రచించిన సౌందర్యలహరి బోధనాచార్యులు ప్రేమలత ఓంప్రకాశ్ నేతృత్వంలో సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి కృపకు పాత్రులయ్యే మాసం శ్రావణమాసం అని, ఈ కాలంలో ప్రతి ఇంటా ప్రతి రోజు మహాలక్ష్మిదేవి సేవలకు అంకితమవుతామన్నారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీరామ్ విజయలక్ష్మి, గోలి మాలతి, కోశాధికారి ఎస్.వసంత, వ్యవస్థాపక అధ్యక్షురాలు కెఎస్.వరలక్ష్మి, మాడిశెటి సంగీత, ఆరెటి సంధ్యా రాణి, నంబూరి వాణికుమారి, తుమ్మన లక్ష్మి పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటి విద్యార్థి మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి : అందెల శ్రీరాములు



బడంగ్‌పేట్‌లో ఆందోళన చేస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** బాసర ట్రిపుల్ ఐటి విద్యార్థి సురేష్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలంగాణ రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్ డిమాండ్ చేశారు. విద్యార్థి ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమని ఆరోపిస్తూ బుధవారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ చౌరస్తాలో బిజెవైఎం అధ్యక్షుడు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అందెల మాట్లాడుతూ బాసర ట్రిపుల్ ఐటిని గవర్నర్ తమిళి సై సందర్శించిన తర్వాత విద్యార్థులకు వేధింపులు ఎక్కువయ్యాయని ఆరోపించారు. గతంలో ఫుడ్ పాయిజన్ అయిన తర్వాత విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆయన విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న సురేష్ కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలనీ ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలనీ, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం మల్లారెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుడు ఏనుగు రాంరెడ్డి, సీనియర్ నాయకుడు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు గౌర రమాదేవిశ్రీనివాస్, రామిడి మాధురి వీరకర్ణారెడ్డి, నాయకులు చిత్రం శ్రీనివాస్, చక్రవర్తుల జగన్మోహనాచార్యులు, నిమ్మల రవికాంత్‌గౌడ్, కుంటి భాస్కర్, మమత తదితరులు పాల్గొన్నారు.

## సింగిరెడ్డి జగన్మోహన్‌రెడ్డికి పితృ వియోగం



జగన్మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు సింగిరెడ్డి జగన్మోహన్‌రెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి సింగిరెడ్డి నర్సింహారెడ్డి (80) వృద్ధాప్య అనారోగ్య కారణాలతో మంగళవారం సాయంత్రం మృతి చెందారు. అయితే బుధవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి బాలాపూర్‌కు వచ్చి నర్సింహారెడ్డి భౌతికకాయానికి నివాళులర్పించి జగన్మోహన్‌రెడ్డిని పరామర్శించారు. అదే విధంగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, టిపిసిసి కార్యదర్శి వంగేటి ప్రభాకర్‌రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి మాజీ అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట్ కో-ఆప్షన్ సభ్యుడు గుండోజు రఘునందనచారి, రామిడి రాంరెడ్డి, కళ్ళెం ఎల్లారెడ్డి తదితరులు జగన్మోహన్‌రెడ్డిని పరామర్శించారు.

## రామంతాపూర్‌లో ఘనంగా కామరాతి బీరప్పస్వామి కల్యాణోత్సవం

**రామంతాపూర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లో శ్రీ కామరాతి బీరప్పస్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. కామరాతి బీరప్పస్వామి దేవాలయం వార్షికోత్సవం సందర్భంగా కల్యాణోత్సవం, బోనాల ఉత్సవాలు అంగరంగ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ముఖ్య అతిధిగా పాల్గొని కామరాతి బీరప్పస్వామికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటా శ్రీ కామరాతి బీరప్పస్వామి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్, రేవు నరసింహ, వంగాల సంతోష్‌గుప్త, డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.నారాయణదాసు, శైలేందర్, పలువురు కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



కార్పొరేషన్‌లో మొక్కలు నాటుతున్న ఛైర్మన్ వాసుదేవరెడ్డి

**మలక్‌పేట, ఆగస్టు 24 ప్రభాతవార్త :** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వికలాంగుల సంక్షేమ శాఖ ఛైర్మన్ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. దివ్యాంగులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించడానికి మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం హరిత హారం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తుందన్నారు.

## డివిజన్ సమస్యలు పరిష్కరించండి : శ్రీవాణి




డివిజన్ సమస్యలపై జెడ్‌సికి వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

**రామంతాపూర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** రామంతాపూర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్ ఆధ్వర్యంలో బుధవారం జోనల్ కమిషనర్ పంకజను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నిరుపేయోగంగా ఉన్న స్వచ్ఛ టాయిలెట్లు తొలగించి పచ్చదనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. శాంతినగర్, వివేక్‌నగర్‌లో బాక్స్ డ్రైన్ ఏర్పాటు చేయాలని, కొత్త సివరేజీ లైన్లువేయాలని సూచించారు. డివిజన్‌పరిధిలోని ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, చిన్నచెరువు, స్మశానవాటికలు, బాలకృష్ణ నగర్ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా పర్యటించాలని కోరారు. దీనిపై జోనల్ కమిషనర్ పంకజ స్పందిస్తూ త్వరలోనే డివిజన్‌లో అధికారులతో కలిసి పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

## అవినీతిపై ప్రశ్నిస్తే అక్రమ కేసులా...



హయత్‌నగర్‌లో నిరసన ప్రదర్శనలో కార్పొరేటర్లు, నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత అవినీతిపై ప్రశ్నిస్తే బీజేపీ నాయకులపై దాడులు చేయడం, అక్రమ కేసులు నమోదు చేయించడం సిగ్గుచేటని హయత్‌నగర్, మన్సూరాబాద్ కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. బీజేపీ నేతలపై దాడులు అక్రమకేసులను ఖండిస్తూ బీజేపీ హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్ల నాయకులు బుధవారం హయత్‌నగర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్‌లాబియింగ్‌లో కవిత పాత్రపై ప్రశ్నించిన బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సామరంగారెడ్డి, కార్యకర్తలపై టీఆర్ఎస్ నాయకులు దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. కేసీఆర్ కుటుంబ సభ్యుల అవినీతి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు విస్తరిస్తోందని విమర్శించారు. త్వరలోనే అన్ని బయటపడతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కళ్లెం రవీందర్‌రెడ్డి, బండారి భాస్కర్, నాంపల్లి రామేశ్వర్, పారందమహేష్, గోవిందాచారి, ఎర్రవెల్లి సత్యనారాయణ, కవితరెడ్డి, అనితరెడ్డి, సబితరెడ్డి పాల్గొన్నారు.

## బండి సంజయ్ అరెస్ట్ హేయమైన చర్య : రాగుల

**వనస్థలిపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్ట్‌ను నిరసిస్తూ వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి, రైల్వే బోర్డు సభ్యుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ బిజెపి అధ్యక్షుడు నూతి శ్రీనివసరావుల ఆధ్వర్యంలో వనస్థలిపురం కాంప్లెక్స్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నాయకులు నినాదాలు చేసారు. శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్‌పై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని రాష్ట్రంలో సిఎం కెసిఆర్ రజాకార్ల పాలన అమలు చేస్తున్నారని త్వరలో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్యక్రమంలో నీళ్ల అంజన్‌కుమార్‌గౌడ్, చిన్నాయాదవ్, వీరస్వామి గౌడ్, రాజేష్, కృష్ణవేణి, రోజారమణి, రేవతి తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ - ఓటరు అనుసంధానంపై సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఓటర్ కార్డును ఆధార్ కార్డుతో అనుసంధానం చేయించుకోవడానికి స్వచ్ఛందంగా ఓటర్లు ముందుకు రావాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పంచకాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో బుధవారం ఎస్‌బిహెచ్ జిఎ-2 కాలనీలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఓటరు కార్డును ఆధార్‌తో లింక్ చేయించుకునేలా ప్రజల్లో తగిన అవగాహన కల్పించాలని సూచించారు.

## అర్హులైన వృద్ధులకు పించన్ల పంపిణీ

**నేరేడ్‌మెట్ ఆగస్టు 24 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయంలోనే పేదలు అభివృద్ధి చెందుతారని వడాయిగూడెం సర్పంచ్ గుండు మనీష్ గౌడ్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం 57సంలు నిండిన వారికి మంజూరు చేసిన పించన్లను ఆయన ఆధ్వర్యంలో గ్రామంలోని 8 మందికి పంపిణీ చేసారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ సందీప్ రెడ్డి, భువనగిరి ఎంపిపి నిర్మల వెంకటస్వామి, జెడ్‌పిటిసి మల్లయ్య సమక్షంలో అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా రాష్ట్రంలో సుమారు 10లక్షల మందికి కొత్త పెన్షన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి రాంపల్లి క్రిష్ణగౌడ్, కార్యదర్శి ఆమని, గ్రామశాఖ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్ దేవాలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు సన్మానం

**సైదాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సహకరించిన దాతలను బుధవారం దేవాలయంలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. స్వామి వారి మూలవిరాటుకు వెండి కవచము ఏర్పాటు, శ్రీ వేణుగోపాల స్వామి నూతన విగ్రహప్రతిష్ఠ, నూతన ధ్వజస్థంబ ప్రతిష్టాపన, శ్రీ సరస్వతి ఆలయ మండప విస్తరణ, క్యూలైన్ల ఏర్పాటు, శ్రీ విశ్వనాథ ఆలయం ముందు, శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ మండపంలో గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటు వంటి పనులకు సహకరించిన దాతలను సన్మానించారు. దాత తాళ్లపల్లి మహేందర్ సహకారంతో దాదాపు రూ.20లక్షల వ్యయంతో 28 కిలోల వెండితో చేయించిన వెండికవచాన్ని స్వామివారికి అలంకరించారు. కార్యక్రమంలో ఇవో శ్రీనివాస్ శర్మ, ఆలయ కమిటీ ఛైర్మన్ ఈశ్వరమ్మ యాదవ్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ బిజెపి నాయకుల నిరాహార దీక్ష



దీక్ష చేస్తున్న బిజెపి నాయకులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** రాష్ట్ర బిజెపి పార్టీ ఆదేశాల మేరకు అక్రమ అరెస్టులు, అరాచక దాడులు, నిరంకుశ నిర్బంధంపై బిజెపి కొత్తపేట డివిజన్ లో బుధవారం నిరసన దీక్ష కార్యక్రమన్ని నిర్వహించారు. కొత్తపేట డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంచి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు అంబుల మల్లేష్, వగ్గుల సుందర్ నారాయణ, ఉపేందర్ ఠాకూర్, సైదులు, రాకేష్ యాదవ్, ఊరెళ్ళి రామకృష్ణ, గట్టు మహేష్, సూరి, చందు, రామ్‌శరన్, ఎన్.ప్రదీప్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ : రాగిడి

**ఉప్పల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** నిరుపేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ అందించి వారికి అన్ని విధాలుగా చేయూత అందిస్తున్నామని మధురా చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిలుకానగర్‌లో మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా రాణించేందుకు కుట్టు శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మధురా ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు తమ వంతు చేయూత అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కరిపే సంతోష్‌కుమార్, సాయిబాబా, సురేందర్‌రెడ్డి, శాంతియాదవ్, కావ్య, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి వేదిక ప్రజా దర్బార్ : ఎమ్మెల్యే మైనంపల్లి



ప్రజా దర్బార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మైనంపల్లి

**నేరెడ్‌మెట్ ఆగస్టు 24 ప్రభాతవార్త:** ప్రజా దర్బార్‌తోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం 138 డివిజన్‌లో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రజా దర్బార్ దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో 4వేల 854, 1754 కొత్త పెన్షన్లన మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. గత రెండు నెలల పరిధిలో సుమారు 8కోట్లతో అభివృద్ధి పనులు చేసామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్లు, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్

**హయత్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** వార్డులవారిగా సమస్యలను పరిష్కరించి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ చెవుల స్వప్న అన్నారు. మున్సిపాలిటీ పరిధి 7వ వార్డులో 7.50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్ లైన్ పనులకు కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను పూర్తిచేసి ప్రజలకు సమస్యలు లేకుండా చూస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్‌పర్సన్ చామసంపూర్ణారెడ్డి, కమిషనర్ రామాంజులరెడ్డి, కౌన్సిలర్ పసుల రాజేందర్, నాయకులు చామవిజయశేఖర్‌రెడ్డి, బొర్రసురేష్, పందుగుల రాజు, చెవుల చిరంజీవి, శ్రీనివాస్, ఖలీం పాల్గొన్నారు.

## చంపాపేట డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

**సైదాబాద్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. న్యూ మారుతీనగర్, హరిజనబస్తీలలో కాంపౌండ్ వాల్స్, మాధవనగర్ కాలనీలో రజక సంఘం స్థలానికి కాంపౌండ్ వాల్, మాధవనగర్‌లో సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో గజ్జెల మధుసూధన్‌రెడ్డి, నల్ల రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, రాజిరెడ్డి, రోజారెడ్డి, అనసూయ, రమాదేవి, సరోజ, ఉమా మహేశ్వర్, గోపాల్ ముదిరాజ్, మల్లేష్‌గౌడ్, భానుప్రకాష్‌రెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, నిశికాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

**నాచారం, ఆగస్టు 24 ప్రభాతవార్త:** మల్లాపూర్ డివిజన్‌లో ఆయా ప్రాంతాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు, కార్పోరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. వార్డు కార్యాలయంలో ఆయన జిహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలసి రివ్యూ మీటింగ్‌ను ఏర్పాటు చేశాసి పలు సూచనలు చేశారు. అభివృద్ధి పనుల్లో వేగం పెంచి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసీ డిప్యూటీ ఈఈ రూప, ఏఈ శ్రవంతి, జలమండలి మేనేజర్ సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

## అగ్రిట్రేడర్స్ ఆధ్వర్యంలో పర్యావరణ శుద్ధి యజ్ఞం



మార్కెట్‌లో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

**మలక్‌పేట,ఆగస్టు 24 ప్రభాతవార్త :** మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ ఆధ్వర్యంలో పర్యావరణ శుద్ధి యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అనితానాయక్, అగ్రిట్రేడర్స్ అధ్యక్షుడు దేవర రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి బట్కిరి వివేకానంద్‌లు విచ్చేసి మాట్లాడుతూ సమాజం, ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుతూ ఈ యజ్ఞాన్ని నిర్వహించామన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బట్కిరి విద్యానంద్, కట్టా మల్లేషం, బట్కిరి విజయానంద్, రాచూరి దయ, రాచూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలు ఐక్యతకు నిదర్శనం




సదస్సులో మాట్లాడుతున్న విశ్వప్రసన్న తీర్థస్వామి

**వనస్థలిపురం, ఆగస్టు 24 ప్రభాతవార్త :** భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించడానికి, వారిలో ఐక్యతను నింపడానికి గణేష్ సామూహిక ఉత్సవాలు తోడ్పడతాయని ఉడిపి పెజావర్ పీఠాధిపతులు విశ్వప్రసన్న తీర్థస్వామి పేర్కొన్నారు. వనస్థలిపురంలోని పనామా చౌరస్తావద్ద జరిగిన హిందూ ఏకతా సదస్సులో పీఠాధిపతి మాట్లాడుతూ మాతృభూమి మీద గౌరవం ఉండాలన్నారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రపంచంలోనే సముచిత గౌరవముందని అన్నారు. గణేష్ ఉత్సవాల ద్వారా ఐక్యత ఏర్పడుతుందని, కలిసికట్టుగా హిందువులందరూ గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. అదేవిధంగా విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి రావినూతల శశిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గణేష్ ఉత్సవాలకు కఠిన నిబంధనలు పెడుతున్నారని, రజాకారుల ఎజెండాను బొంద పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కళ్లెం నవజీవన్ రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, రాధాధీరజ్‌రెడ్డి, బద్దం ప్రేమ్‌కుమార్‌రెడ్డి, విహెచ్‌పి రాష్ట్ర అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, రామరాజు, యాదిరెడ్డి, కళ్లెం బాల్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, శ్రీధర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, భాస్కర్, యశ్పాల్‌గౌడ్, విజయ్‌కుమార్, రవికుమార్, బీరం శ్రీధర్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులపై చర్చించాలని వినతి

**ఉప్పల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఉప్పల్ సర్కిల్‌లో పరిధిలోని నాలుగు డివిజన్‌లలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు చెల్లించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ సర్కిల్ కాంట్రాక్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కాంట్రాక్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.మల్లేష్, కె.శ్రీనివాస్, మురళీ, రవీందర్‌రెడ్డి, రమేష్, ఎస్.మధుసూధన్, శ్రీనివాస్, బాబు, ప్రభాకర్, శివారెడ్డి, గోపాలకృష్ణ, అంజనేయులు, కుమార్, వి.సురేష్ తదితరులు మాట్లాడుతూ ఉప్పల్ సర్కిల్ పరిధిలో అభివృద్ధి పనులు పూర్తి చేసి ఏడాది పూర్తవుతున్నా బిల్లులు చెల్లించడం లేదని, దీంతో తాము అప్పుల పాలు అయ్యామని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే ప్రస్తుతం జరుగుతున్న పనులు నిలిపివేస్తామని హెచ్చరించారు. దీనిపై గ్రేటర్ కౌన్సిల్ సమావేశాల్లో లేవనెత్తాలని కోరారు. దీనిపై కార్పొరేటర్ బండారు శ్రీవాణి స్పందిస్తూ కాంట్రాక్టర్ల బిల్లుల విషయం కౌన్సిల్ మీటింగ్‌లో చర్చించేందుకు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు బండారు వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

## బాలాపూర్ పాఠశాలను సందర్శించిన డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్

**సరూర్‌నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం డిప్యూటీ మేయర్, రాష్ట్ర బిఎస్‌పి ప్రధాన కార్యదర్శి ఇబ్రాం శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా తుర్కయాంజాల్‌లో సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కొత్తకుర్మ సత్తయ్య తదితరులు

**తుర్కయాంజాల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్‌లో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయాన్ని ఈ నెల 25న ప్రారంభించడానికి ముఖ్యమంత్రి కెసిఆర్ విచ్చేస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు తుర్కయాంజాల్ టిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా డిసిసిబి వైస్ ఛైర్మన్ కొత్తకుర్మా సత్తయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రారంభోత్సవానికి కౌన్సిలర్లు, వార్డ్ అధ్యక్షులు, వివిధ వార్డు అనుబంధ సంఘాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, హాజరు కావాలని కోరారు ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షులు వేముల అమరేందర్‌రెడ్డి, పార్టీ అధ్యక్షురాలు మార్గపు అశ్విని, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ రామావత్ కళ్యాణ్ నాయక్, సామ సంజీవరెడ్డి, కందాడ లక్ష్మారెడ్డి, కందాల బల్దేవ్ రెడ్డి,చెవుల దశరథ, మన్మోహన్ సింగ్, పుల్ల గుర్రం విజయానంద రెడ్డి, తాళ్లపల్లి మోహన్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి : చింతల



రంగ నరసింహ గుప్తాను సన్మానిస్తున్న పారిశుద్ధ కార్మికులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నాగోల్‌లో స్వచ్ఛ్ ఆటో కార్యక్రమం నిర్వహించారు. డివిజన్ పరిధిలో స్వచ్ఛ్ ఆటోలు ప్రతి ఇంటికి వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. ప్రతి ఒక్క ఆటోడ్రైవర్ రోజు విధులకు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ శ్రీనివాస్, శానిటైజర్ సూపర్ వైజర్ చంద్రశేఖర్, జవాన్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పాటు చేస్తాం : నరసింహ...** ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆరోగ్యకరమైన వాతావరణ ఏర్పాటు చేస్తామని చైతన్యపురి డివిజన్ కార్పొరేటర్ రంగ నరసింహగుప్తా పేర్కొన్నారు. చైతన్యపురి డివిజన్‌లోని పారిశుద్ధ కార్మికులు, చెత్త తీసుకవెళ్లే రిక్షా కార్మికులతో కార్పొరేటర్ వార్డు కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బేతి

**ఉప్పల్, ఆగస్టు 24 ప్రభాతవార్త :** తిరుమల శ్రీవారిని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పలువురు పార్టీ నేతలతో కలిసి దర్శించుకున్నారు. ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డితోపాటు, జె.వెంకటేశ్వర్‌రెడ్డి, చిలుకానగర్ డివిజన్ టిఆర్ఎస్‌నేతలు గుడి మధుసూధన్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్లె నర్సింగ్ రావు, పిట్టల నరేష్ ముదిరాజ్, ఈరెల్లి రవీందర్‌రెడ్డి, కొంపల్లి రాజ్‌కుమార్, తిరుమలేష్, వెంకటేష్, పారెల్లి సాగర్, రామకృష్ణ తదితరులు స్వామి వారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.